క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


ఒర్రెను పరిశీలిస్తున్న తహసీల్దార్ రామ్మోహన్‌రావు

బెజ్జూర్: మండల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రామ్మోహన్‌రావు అన్నారు. మండలంలోని కృష్ణపెల్లి, సుస్మీర్ గ్రామాల మధ్యలో ఉన్న ఒర్రె బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు ఉప్పొంగింది. ఎంపీడీవో బండారి ప్రవీణ్ కుమార్‌తో కలిసి గురువారం ఒర్రెను పరిశీలించారు. రాబోయే మూడురోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్పా బయటకు రావద్దని సూచించారు. అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

నీటి ప్రవాహం తగ్గాకే వెళ్లాలి

కెరమెరి: నీటి ప్రవాహం తగ్గాకే వాగులు, కల్వర్టులు దాటి వెళ్లాలని ఎస్సై మధుకర్, తహసీల్దార్ సంతోష్‌కుమార్, ఎంపీడీవో అంజద్‌పాషా పేర్కొన్నారు. మండలంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సాంగ్వి సమీపంలో లోలెవల్ కల్వర్టును గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెలికే, ఇంద్రానగర్ ఇందాపూర్ తదితర గ్రామాల స మీపంలో కల్వర్టులపై నుంచి వర్షపు నీరు చేరిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ముసురు వాన

దహెగాం: మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా ముసురు వర్షం కురుస్తుంది. దీంతో పత్తి పూత కాత రాలిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పూతలో వర్షపు నీరు నిలిచి మురిగిపోయే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న రాజ్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని భట్టుపల్లి పంచాయతీలోని జీడిచేను గ్రామంలో శ్రీ శివకేశవ ఆలయ పునర్నిర్మాణానికి సిర్పూర్ తాలూకా యాదవ సంఘం అధ్యక్షుడు ఆవుల రాజ్‌కుమార్ గురువారం రూ.15 వేలు విరాళంగా అందజేశారు. ఆలయ ముఖద్వారం దర్వాజకు విరాళం అందజేసినట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు సత్యనారాయణ, అశోక్, గ్రామస్తులు ఉన్నారు.

సన్మానం


సన్మానిస్తున్న ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి

రెబ్బెన: జీఎం వర్క్‌షాప్స్ అండ్ ఎనర్జీ మేనేజ్‌మెంట్‌గా పనిచేస్తూ ఈనెలలో పదవీ విరమణ పొందుతున్న ఫిటజరాల్డ్ ఏసురత్నంను బెల్లంపల్లి ఏరియా అధికారులు సన్మానించారు. గురువారం ఏరియా పర్యటన కోసం వచ్చిన ఆయనకు గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం విజయభాస్కర్ రెడ్డి, అధికారులు సన్మానించి మొక్కను అందజేశారు. ఎస్వో టూ జీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీర్ కృష్ణమూర్తి, పీవో ఉమాకాంత్ అన్ని విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సామాజిక తనిఖీ గ్రామసభలు

వాంకిడి: మండలంలోని బంబార, ఇందాని, ఖమాన, వాంకిడి, కనర్‌గాం, జైత్‌పూర్, ఖిరిడి, సామేల పంచాయతీ కార్యాలయాల్లో గురువారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పనులకు సామాజిక తనిఖీ బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను గ్రామసభలో వెల్లడించారు. కనర్‌గాంలో ఉపాధి పనుల్లో భారీ అవకతవకలు జరిగాయని, ఉన్నతాధికారులు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. పలు గ్రామసభల్లో డీఆర్పీలు వివరాలను గ్రామస్తుల సమక్షంలో వెల్లడించారు. ఏపీవో శ్రావణ్‌కుమార్, గ్రామస్తులు జాడి ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

27న బతుకమ్మ వేడుకలు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని పద్మశాలి భవనంలో పద్మశాలి సేవా సంఘం, భవన కమిటీ ఆధ్వర్యాన ఈనెల 27న బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు కమిటీ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పారితోషికం ఏది?

- సమగ్ర సర్వే సిబ్బందికి అందని ప్రోత్సాహకం
- పది నెలలుగా ఎదురుచూపులు
- మండలంలో 11,942 కుటుంబాల సర్వే

రెబ్బెన: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కులగణన సర్వేలో పాల్గొన్న ఎన్యూమరేటర్లు, డేటా ఆపరేటర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బందికి పారితోషికం నేటివరకు అందలేదు. సర్వే ప్రక్రియ పూర్తయి దాదాపు పది నెలలు పూర్తవుతున్న తమకు ప్రోత్సాహకం అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో గత నవంబర్‌లో ప్రభుత్వం సర్వే చేపట్టి ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలు సేకరించింది. మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా సర్వేకు ముందు రెండు రోజుల పాటు ఇంటింటికి వెళ్లి కుటుంబాలను గుర్తించేందుకు స్టిక్కరింగ్ చేశారు. దాని ఆధారంగా 11, 942 కుటుంబాలను అధికారులు గుర్తించి సర్వే ప్రక్రియ చేపట్టారు. ఇందులో 10 మంది సూపర్‌వైజర్లు, 97 మంది ఎన్యూమరేటర్లు విధులు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు ఎన్యూమరేటర్లుగా పనిచేసి అన్ని వివరాలు సేకరించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉదయం పాఠశాలలో విధులు నిర్వహించి మధ్యాహ్నం నుంచి సర్వే చేపట్టారు. ప్రభుత్వం కేవలం 10 రోజుల గడువు మాత్రమే విధించగా రాత్రిపగలు తేడా లేకుండా వందశాతం సర్వే పూర్తిచేశారు.


ఇంటింటి సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లు (ఫైల్)

సర్వే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన పారితోషికం ఎప్పుడు విడుదల అవుతుందా వారు ఆశగా ఎదురుచూస్తున్నారు.

పెండింగ్‌లో రూ.13.65 లక్షలు

మండలంలో రూ.13.65 లక్షల పారితోషకం పెండింగ్‌లో ఉంది. సూపర్‌వైజర్లకు రూ.1.20 లక్షలు, 97 మంది ఎన్యూమరేటర్లకు రూ.9.70 లక్షలు, పంచాయతీ కార్యదర్శులు, ఈ–పంచాయతీ ఆపరేటర్లకు రూ.95 వేలతోపాటు డాటా ఎంట్రీ ఆపరేటర్లకు సైతం అందించాల్సి ఉంది.

ప్రభుత్వం నుంచి విడుదల కాలేదు

సర్వే సిబ్బందికి ప్రభుత్వం నుంచి రావల్సిన పారితోషికం విడుదల కాలేదు. గతంలోనే వారికి బ్యాంకు ఖాతా వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు అందజేశాం. ప్రభుత్వం నుంచి అందే డబ్బులు నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమవుతాయి. – శంకరమ్మ ఎంపీడీవో

మెరుగైన వైద్యం అందించాలి

ఉట్నూర్‌రూరల్: పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని దంతనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్యులతో మాట్లాడి ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. గిరిజన గర్భిణులను ముందస్తుగా గుర్తించి ఆసుపత్రిలో చేర్చుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఆసుపత్రిలోని మందులను పరిశీలించారు. కాలం చెల్లిన మందులను స్టోర్ రూంలో ఉంచొద్దన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ..

మండలంలోని కుమ్మరిగుంట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా


వైద్య సేవలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఉన్నత విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మండల కేంద్రంలోని కుమురం భీం ప్రాంగణంలో నిర్మించిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) భవనాన్ని పరిశీలించారు. ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ఐటీఐ ప్రిన్సిపాల్ రోడ్డ శ్రీనివాస్‌ను ఆదేశించారు.

వర్షాలకు కూలిన ఇల్లు

ఆసిఫాబాద్‌అర్బన్: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాకేంద్రంలోని జన్కాపూర్ జైలు సమీపంలో ఏట తిరుపతి ఇల్లు కూలింది. తమది నిరుపేద కుటుంబమని, ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని తిరుపతి వేడుకుంటున్నాడు.





నేలవాలిన బంతి తోట

పెంచికల్‌పేట్: మండలంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురుస్తోంది. ఎల్కపల్లి గ్రామంలోని రెండెకరాల బంతి తోట పూర్తిగా నేలవాలింది. పూలు చేతికందే సమయంలో నేలకొరగడంతో రైతు కన్నీరుమున్నీరయ్యాడు. భారీ వర్షానికి మండలంలోని పెద్దవాగు, బొక్కివాగులతోపాటు ఒర్రెలు పొంగి ప్రవహిస్తున్నాయి.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రులు


భట్టుపల్లిలోని అన్నపూర్ణదేవిగా అమ్మవారు


కాగజ్‌నగర్‌టౌన్: అన్నపూర్ణ రూపంలో


కన్యకాపరమేశ్వరి ఆలయంలో అన్నపూర్ణదేవిగా..

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో శరన్నవరాత్రులు భక్తిశ్రద్ధలతో జరుపుకొంటున్నారు. నాలుగ రోజు భాగంగా గురువారం అమ్మవారిని కాత్యాయినీ దేవి రూపంలో అలంకరించారు. దుర్గామాత, శారదామాత మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని బాపూనగర్ శారదమండలి వద్ద డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద భక్తులతో సందడిగా మారింది.

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని భట్టుపల్లి, అందవెల్లి, రాస్పెల్లి, అందవెల్లి గ్రామాల్లో దుర్గామాత మండపాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగోరోజు అన్నపూర్ణదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భట్టుపల్లిలోని మిత్ర యూత్ బాల దుర్గామండలి వద్ద అన్నదానం నిర్వహించారు.

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గురువారం అమ్మవారు అన్నపూర్ణదేవిగా అలంకరించారు. పట్టణంలోని వార్డు నెం22, నౌగాం బస్తీ, టీచర్స్ కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీ, కన్యాకాపరమేశ్వరి ఆలయం, సర్‌సిల్క్‌లోని దుర్గామాత మండపాల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు.

కెరమెరి: మండలంలోని వాడవాడల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి వద్ద భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. అర్చకుడు కులకర్ని బాపూదేవ్ ఆధ్వర్యంలో శివాలయంలో గ్రామ పటేల్ వాడై సోనేరావు అభిషేకం చేశారు.

దహెగాం: మండల కేంద్రంలోని శివాలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి గురువారం అన్నపూర్ణ దేవి రూపంలో దర్శనమిచ్చారు. అన్నపూర్ణదేవి


అమ్మవారిని దర్శించుకుంటున్న సీఐ సంజయ్


వాసవీ మందిర్ శారదా మండలి వద్ద..


కెరమెరి: అభిషేకం చేస్తున్న సోనేరావు దంపతులు

రూపంలో భాగంగా అమ్మవారికి కూరగాయలతో అలంకరించారు.

రెబ్బెన: దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని రెబ్బెన సీఐ సంజయ్, డిప్యూటీ తహసీల్దార్


దహెగాం అన్నపూర్ణ దేవి అవతారంలో..

సరిత వేర్వేరుగా దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్‌స్వామి అధికారులకు శాలువాతో సన్మానించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. బెల్లంపల్లి ఏరియాలోని వర్క్‌షాప్ ఆవరణలో గల దుర్గామాత ఆలయాన్ని గురువారం జీఎం విజయభాస్కర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్వోటూ జీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీర్ వీరన్న, పీవో ఉమాకాంత్ పాల్గొన్నారు.


బాపూనగర్ శారదామండలి వద్ద డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు


రెబ్బెన: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


గాంధీ చౌక్‌లోని దుర్గామాత వద్ద మహిళలు

తులం బంగారం హామీ ఏమైంది?

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆడబిడ్డల పెళ్లికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ఆర్థికసాయంతోపాటు తులం బంగారం ఇస్తామన్న కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఏమైందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రశ్నించారు. రెండేళ్లు గడుస్తున్నా ఇంకా ఎప్పుడు ఇస్తారో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో 93 మంది లబ్ధిదారులకు గురువారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. వీటితోపాటు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎన్నికల్లో మోసపూరిత హామీ ఇచ్చిందన్నారు. 420 హామీలను మేనిఫెస్టోలో పెట్టామని గొప్పగా చెప్పు


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కుని, ఆరు గ్యారంటీలు పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహమ్మద్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్లు పంపిణీ

లింగాపూర్: మండలంలోని జాముల్‌ధర, లింగాపూర్ గ్రామ రైతులకు జిల్లా వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ అధికారి కె.అంజనేయులు గురువారం వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి కృషి సంసాయ్ యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వాటర్‌షెడ్ పథకంలో సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు 25% రైతుల డీడీలు కట్టుకుంటే, పీఎంకేఎస్‌వై కింద 75% సబ్సిడీ రూపంలో స్ప్రింకర్, పైపుతోపాటు, ఇతర పనిముట్లు అందిస్తామని తెలిపారు. మండల


పనిముట్లు అందిస్తున్న అధికారులు

ప్రాజెక్ట్ టెక్నికల్ ఆఫీసర్ షేక్ హైమద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరామర్శ


అశ్రఫ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన ఆర్టీఐ అక్టివిస్ట్ అశ్రఫ్ గాయాలు కాగా, అతని సోదరుడు అజీమ్ మృతిచెందాడు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు మృతుడి కుటుంబ సభ్యులను, గాయాలపాలైన అశ్రఫ్‌ను పరామర్శించారు.

రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణం నిలిపివేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సంజీవయ్య కాలనీ సమీపంలో చేపట్టనున్న రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టకుండా నిలిపివేయాలని కోరుతూ కాలనీవాసులు గురువారం సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో ఇళ్లు కోల్పోవాల్సి వస్తుందని, కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. ఇళ్ల నిర్మాణాలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

వయోజనులకు బ్యాంక్ ఖాతా ఉండాలి

తిర్యాణి: వయోజనులకు బ్యాంక్ ఖాతాలు కలిగి ఉండాలని నాబార్డ్ అధికారి అంజన్న అన్నారు. మండలంలోని గడలపెల్లి గ్రామంలో గ్రామీణ జన సురక్ష పథకంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అనవసర ఖర్చులను తగ్గించి బ్యాంకుల్లో పొదుపు చేసుకునేలా అలవాటుపడాలన్నారు. ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ అనిల్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ నరేశ్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల కార్యవర్గం

కాగజ్‌నగర్‌టౌన్: విశ్రాంత ఉద్యోగుల కార్యవర్గాన్ని పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జయదేవ్ అబ్రహం, ప్రధాన కార్యదర్శిగా శివప్రసాద్ నాయర్, కార్యదర్శిగా అంకయ్య, ఉపాధ్యక్షులుగా రాజేంద్రప్రసాద్, చంద్రమౌళి, సోఫియా, వినోద్, నర్సయ్య, అన్వర్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా గుర్రాల వెంకన్న, కమటిపల్లి లింగయ్య, పరిశీలకులుగా కర్ణగౌడ్, సిరాజ్ వ్యవహరించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ నూతన భవన నిర్మాణానికి రూ.15 కోట్ల నిధులు మంజూరు చేసిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు గురువారం క్షీరాభిషేకం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే అహర్నిశలు కృషి చేస్తున్నారని నాయకులు అన్నారు. ప్రజాసంక్షేమం ధ్యేయంగా ముందుకు వెళ్తుందన్నారు. అన్నివర్గాల అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. ఐటీడీఏ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు నిసార్, మహేందర్, దూట రాజేశ్వర్, తిరుపతి పాల్గొన్నారు.

సాకడలో కళాజాత

కెరమెరి: మండలంలోని సాకడ గ్రామంలో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. మాదవద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, మహిళల రక్షణ, ట్రాఫిక్ నిబంధనలు, 100 డయల్‌పై కళాకారులు అవగాహన కల్పించారు. ఎస్సై మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీన్ దయాళ్ జయంతి


నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు, గ్రామస్తులు

లింగాపూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు సురేశ్‌నాయక్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.